కథ

అమ్మ బాబోయ్.....

ఆర్.ఎస్.హైమవతి

''అరుణా! ఓ అరుణా! నిన్నే..'' అంటూ త్రీటైర్‌లో లోయర్ బెర్త్‌మీద పడుకున్న అరుణని అర్ధరాత్రి మిడిల్ బెర్త్ మీంచి దిగి తట్టి లేపాడు శ్రీకాంత్.

''ఏమిటండీ? ఏమైంది? అర్ధరాత్రి కళ్లు మూసుకుని పడుకోక ఏం కొంపమునిగిందని తట్టి లేపుతున్నారు?'' నిద్ర పాడయినందుకు విసుక్కుంటూ అడిగింది అరుణ.

''అది కాదే! మనం ఇంటి నించీ వచ్చేటప్పుడు వీధిగుమ్మానికి తాళం వేశామా? లేదా? అని సందేహంగా ఉంది'' అన్నాడు శ్రీకాంత్.

''బాగుంది వరస! అర్ధరాత్రి మంచి సందేహమే వచ్చింది. ఇప్పటికి మనం ఇల్లు వదిలి పది రోజులైంది. ఇన్నాళ్లూ రాని సందేహం ఇప్పుడెందుకు వచ్చినట్టో''

''ఇప్పుడే చిన్న కునుకు పట్టి ఓ కల వచ్చింది. మన ఇంట్లో సామాన్లన్నీ దొంగలు దోచుకుపోయినట్లు. ఇల్లంతా ఖాళీగా ఉన్నట్లు. అందుకే సందేహం వచ్చింది.''

''మీరు సందేహపడుతూంటే నాకూ సందేహంగానే ఉంది. మీరు తాళం చెవులు నాకిచ్చారు. వెంటనే నా హేండ్ బ్యాగ్‌లో వేసుకుని భుజాన్న తగిలించుకుని వాటర్ బాటిల్, తినుబండారాలు ఉన్న కర్రల సంచీ చేత్తో పట్టుకుని గబగబా ఆటో స్టాండ్ వైపు నడిచాను. మీరు తాళం వేశారో, లేదో చూడలేదు. వేసే ఇచ్చుంటారనుకున్నాను.''

''ఓసి నీ దుంపతెగ. తాళం వేశానో లేదో చూడద్దూ? తాళాలు చేతికిస్తే బేగ్‌లో వేసుకుని వచ్చేయడమే! బొత్తిగా బాధ్యత తెలియకుండా పోతోంది'' అన్నాడు కొంచెం గట్టిగా.

''ఆ! బాగానే ఉంది. ఇంటి యజమానినని చెప్పుకుంటారు. ఆమాత్రం బాధ్యత మీకు ఉండొద్దూ? తాళం వెయ్యకుండా పెళ్లాం చేతికి తాళం చెవులిస్తారా? వేసిన తరువాత ఇవ్వాలి గానీ''

''ఓసారి తాళం వేశానో లేదో చూస్తే నీ సొమ్మేం పోయింది?''

''చూస్తే సొమ్మేం పోదు. మీరు వెయ్యకపోతేను, నేను చూడక పోతేను మొత్తం మన సొమ్మంతా పోయుంటుంది'' అంది అరుణ.

పై బెర్తుల వాళ్లు, పక్క బెర్తుల వాళ్లూ అంతా అర్ధరాత్రి ఈ గోలతో నిద్రాభంగం చేస్తున్నందుకు రైల్వే ఎనౌన్స్‌మెంట్లిస్తున్నట్లుగా అన్ని భాషల వాళ్లూ తమతమ శక్తికొలదీ తిట్ల దండకం ప్రారంభించారు. అయితే ఈ భార్యాభర్తలకి తెలుగు, ఇంగ్లీషు తప్ప మిగిలిన భాషలు రాకపోవడం వల్ల బ్రతికి పోయారు. ఏదో తిడుతున్నారని మాత్రం అర్ధమైంది.

''ఇప్పుడేమనుకుని ఏం ప్రయోజనం? జరిగేది జరుగుతుంది. ప్రాప్తమున్న వస్తువులు ఉంటాయి. లేకపోతే పోతాయి'' అని సర్దిచెప్పుకుని ఎవరి బెర్త్‌ల మీద వారు నిద్రకి ఉపక్రమించారు.

మరో తెలుగు తెలిసిన పెద్ద మనిషి ''ఈ బుద్ధి ముందే ఉంటే బాగుండేది'' అని పైకే అనుకున్నాడు.

రాత్రంతా ఇంక ఆ దంపతులకి నిద్ర లేదు. ఇంటి మీద ధ్యాసే పీడిస్తోంది. రైలు దిగి ప్లాటుఫారం దాటి బైటకి వచ్చి ఆటో ఎక్కారన్న మాటే గానీ వారికి ఇల్లు ఏమైందో? ఇంట్లో వస్తువులు ఉన్నాయో? పోయాయో? అనే భయంతో గుండె దడ పెరిగిపోతోంది.

★ ★ ★

సందు మలుపు తిరిగేసరికే ధనేల్ ధనేల్! శబ్దాలు ఓ వైపు, పెద్ద పెద్ద కేకలు ఓ వైపు, పెద్దగా ఏడుపులు వినిపిస్తున్నాయి. అవి తమ కొడుకు, కోడలు, తల్లి గొంతులుగా గుర్తించారు. ఇంకేముంది? ఏదో జరగకూడనిది జరిగిపోతోంది అనుకుంటూ ఆటో దిగి సామాను దింపకుండానే లోపలికి పరుగెత్తాడు శ్రీకాంత్. సామాన్లు రెండు చేతులతోనూ బరబర లాక్కుంటూ లోపలికి వెళ్లిపోయింది అరుణ.

ఆటోవాడు ''సార్! సార్!'' అంటూ పిలుస్తున్నా వినే వారు లేరు. అతడూ లోపలికి వచ్చి చూసి స్థాణువై నిలిచాడు.

★ ★ ★

శ్రీకాంత్ ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యాడు. అరుణ కూడా స్కూలు టీచరుగా ప్రభుత్వోద్యోగం చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంది. ఏకైక పుత్రుడు రవి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న స్వాతిని ప్రేమించానని చెప్పగానే ఆదర్శభావాలు గల అరుణ, శ్రీకాంత్ అంగీకరించి వారి పెళ్లి జరిపించారు.

రవి, స్వాతి హనీమూన్ టూర్‌కి వెళ్లారు. ఎప్పుడూ వీళ్ల దగ్గరుండే శ్రీకాంత్ తల్లి కామాక్షమ్మ రవి పెళ్లికొచ్చిన తన చిన్నకొడుకు చంద్రం దగ్గర కొన్నాళ్లు ఉండి వస్తానంటూ అతడితో వెళ్లిపోయింది. సందడంతా ఒక్కసారిగా సర్దుమణిగిపోయి ఒంటరిగా మిగిలిన అరుణ, శ్రీకాంత్‌లకి తాము కూడా ఎక్కడికైనా కొన్నాళ్లు వెళ్లాలనిపించి నార్త్ ఇండియా టూర్ పెట్టుకుని ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. రైల్లో బెర్త్‌లు కూడా అతి కష్టం మీద సంపాదించారు.

వెళ్లే ముందు తల్లికీ, కొడుక్కీ కూడా సెల్‌కి ఫోన్ చేసి ఇలా తాము తీర్థయాత్రలకి వెళ్తున్నామని మీరు ముందుగా వచ్చేటట్లయితే ఎదురింటి వాళ్ల దగ్గర ఎలాగూ డూప్లికేట్ కీ ఉంటుంది కనుక తీసుకుని ఇంట్లోకి వెళ్లమని చెప్పారు.

రిటైరయ్యాక ఊరికి కొంత దూరంగా ఉన్నా ఆ కాలనీలో ఇళ్ల వాళ్లు ఒకరికొకరు అవసరానికి సాయపడుతూ సఖ్యతగానే ఉంటూంటారు. ఇంచుమించు అదంతా పల్లె వాతావరణంలాగే ఉంటుంది. అందుకే ఎప్పుడూ అవసరానికి ఉంటాయని ఎదురింటి వారి తాళాలు వీళ్ల దగ్గర, వీళ్ల ఇంటి తాళాలు వారి దగ్గరా ఓ డూప్లికేట్ పెట్టుకుంటారు. ఇలాంటి అత్యవసర పరిస్థితిలో పనికొస్తుందని.

చిన్నకోడలి ప్రవర్తనని తట్టుకోలేని కామాక్షమ్మ వారం తిరక్కుండానే తిరిగి పెద్ద కొడుకు దగ్గరకి వచ్చేసింది కొడుకు, కోడలు లేకపోయినా ఇంట్లో పనిమనిషి సాయంతో తానే ఎలాగో వండుకు తింటూ టీవీ చూసుకుంటూ గడుపుతోంది. ఇంతలో రవి, స్వాతి ఊరి నుంచి వచ్చేశారు. వస్తూనే నానమ్మని చూసి అవాక్కయ్యారు.

''ఏం నానమ్మ? చిన్నాన్న దగ్గర్నించీ అప్పుడే వచ్చేశావ్?'' అడిగాడు రవి.

''ఏం చెయ్యమురా? అదే మీ చుప్పనాతి పిన్నమ్మ ఉందిగా! అది నన్నా ఏ టీవీ సీరియలూ చూడనియ్యదు. దానికిష్టమైన ఛానెల్లే ఎప్పుడూ చూస్తూ ఉంటుంది. రిమోట్ ఎప్పుడూ తన దగ్గరే పెట్టుకుంటుంది. అంతా ఆవిడదే పెత్తనం. అందుకే ఇక ఉండలేక వచ్చేశాను'' అంది కామాక్షమ్మ.



''ఓస్! అంతేకదా! నీ మర్యాదకేమీ లోటు చెయ్యలేదు కదా!'' అన్నాడు రవి.

''ఆ! ఏం మర్యాద? అత్తగారి మీద గౌరవం ఉన్న కోడలైతే అత్తగారి చేతికి టీవీ రిమోట్ ఇవ్వద్దూ?'' అంటూ సీరియస్ అయిపోయింది. ఎక్కడ లేని కోపం ఆమె ముఖంలో వ్యక్తమవుతోంది.

రవి, స్వాతి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని పక్కకి తిరిగి నవ్వుకున్నారు. రవి స్వాతితో చెప్పాడు.

''నానమ్మకి పొద్దుటి నించీ రాత్రి పడుకునే వరకూ ఏయే సీరియళ్లు ఆవిడకి నచ్చుతాయో అన్నీ వరుసగా చూస్తుంది. అమ్మ స్కూలుకి, నాన్న ఆఫీసుకి వెళ్లిపోతారు. నాకు చాలా రోజులు చదువు, తరువాత ఆఫీసు సరిపోతుంది. ఏ క్రికెట్ మేచ్ అయినా చూడాలనిపించినా నానమ్మని బాధ పెట్టడం ఎందుకని నేను మా ఫ్రెండింటిలో చూస్తుంటాను. అంచేత మా టీవీ రిమోట్ ఎప్పుడూ నానమ్మ చేతిలోనే ఉంటుంది. మా పిన్ని దగ్గర ఈవిడ ఆటలు సాగలేదు పాపం.''

''అయితే ఎలా రవీ? ఇంట్లో ఉన్నప్పుడూ, శని, ఆదివారాలు టీవీ చూడకుండా ఎలా? ఏదో ఛానెల్ మారుస్తూ చూస్తూ ఉండడం నాకలవాటు'' అంది స్వాతి.

''సరేలే ఇంకో టీవీ కొనుక్కుని మన గదిలో పెట్టుకుందాం'' అన్నాడు రవి.

''పాపం! రిటైరయ్యారు కదా! అత్తయ్యకి, మామయ్యకి మాత్రం ఏం తోస్తుంది? రెండు టీవీలు కొని ఒకటి అత్తయ్యా వాళ్ల గదిలో, ఒకటి మన గదిలో పెట్టుకుందాం'' అంది స్వాతి.

''బాగానే ఉంది ఆలోచన. అప్పుడు ఎవరికి కావల్సినవి వారు చూసుకోవచ్చు. ఆ పని ఇవాళే చేస్తాను'' అంటూ సాయంత్రానికల్లా మరో రెండు టీవీలు కొని రెండు గదుల్లో కనెక్షన్లిప్పించాడు.

''అయ్యో! అవెందుకురా? టీవీ ఒకటుండగా మరో రెండెందుకురా? అమ్మ, నాన్న వచ్చాక అడగన్నా అడగచ్చు కదా!'' అంది బామ్మగారు.

''అమ్మ, నాన్న నీలాగే అనవసరం ఖర్చెందుకని వాళ్ల సంతోషం వదులుకుని నీ కోసం టీవీ ఇచ్చేస్తారు. వాళ్లు ఇక మీదట ఇంట్లోనే ఉంటారు కదా! వాళ్లకి మాత్రం ఏం తోస్తుంది? రిమోట్ నువ్వు అమ్మకి ఇవ్వవు కదా! అందుకే గొడవ లేకుండా అమ్మ వాళ్లకొకటి మాకొకటి కొనేశాను. ఇప్పుడు ఎవరికి కావాల్సిన ప్రోగ్రాములు వాళ్లు ఫ్రీగా చూసుకోవచ్చు. డబ్బు సంపాదించేది అందరి ఆనందం కోసం గానీ ఒక్కరి ఆనందం కోసం కాదు. ఇంక ఎక్కువ మాట్లాడకుండా నీ ప్రోగ్రాములు నువ్వు చూసుకో!'' అన్నాడు రవి.

ఇక మారు మాట్లాడకుండా టీవీ సీరియళ్లకి అంకితమైపోయింది కామాక్షమ్మ. అందులో అత్తగారి కష్టాలు చూస్తూ ఓర్చుకోలేక గట్టిగా పైకే ఏడ్చేస్తోంది. తల బాదుకుంటూ, ముక్కు చీదుకుంటూ, ఇంట్లో ఎవరైనా చచ్చినా అంతలా ఏడవరేమో అనిపించేలా.

ఇక రవి అతడి గదిలో భారత్-పాకిస్తాన్ క్రికెట్ మేచ్ జరుగుతోంది. హోరాహోరీ పోరాటం. ధోనీ సిక్స్‌లు, ఫోర్‌లు కొడుతున్నాడు. రవి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. అరుపులు, కేకలు, చప్పట్లు.

స్వాతికి ఈ మామ్మ, మనవళ్ల పద్ధతి వింతగా తోచింది. ఆమెకి ఇవేవీ నచ్చలేదు. అందుకే అత్తగారి గదిలోని టీవీలో ఇంగ్లీషు సినిమా చూస్తోంది. అందులో పెద్ద పెద్ద శబ్దాలు, అరుపులు వింత జంతువులు వాటిని చూస్తూ ఆమె తన్మయత్వంలో ఉంది. మొత్తానికి ఎవరూ అరుణ, శ్రీకాంత్‌ల రాకని గమనించే స్థితిలో లేరు.

ఇంట్లో అడుగు పెట్టిన శ్రీకాంత్ అరుణ ఈ ముగ్గురి పరిస్థితీ చూసి అచేతనంగా నిలబడిపోయారు. ఇంతలో ఆటోవాడు మళ్లీ ''సార్ సార్!'' అంటూ గట్టిగా పిలిచేసరికి అప్పుడు స్పృహలోకొచ్చి అతడికి డబ్బులిచ్చి పంపాడు.

శ్రీకాంత్, అరుణ లోపలికి వచ్చి స్నానాలు చేసి ఎవరి పనిలో వారు జాయినయిపోయాక సీరియల్ అయ్యాక బాత్‌రూమ్‌కి వెళ్తూ కామాక్షమ్మ, క్రికెట్ మేచ్ లంచ్ టైమ్‌లో రవి, ఇంగ్లీషు సినిమా అయ్యాక స్వాతి మెల్లిగా వచ్చి ఆశ్చర్యంగా ''అమ్మ బాబోయ్! మీరెప్పుడొచ్చారు?'' అన్నారు.

★